

మరో అడుగు

-డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

"ఒకసారి సి.టీ స్కాన్ చేయిద్దాం కేశవ్ గారూ!" అని డా షా చెప్పిన గంటకే ఒక ప్రముఖ డయాగ్నాస్టిక్ లాబొరేటరీ లో యశోదకి స్కాన్ చేశారు.

ఎప్పుడూ ఇంజక్షన్ కూడా ఎరగని, తీసుకోవడానికి ఇష్టపడని యశోదకి అది ఏమాత్రమూ ఇష్టం లేదు.

'ఊరికే భర్తా, పిల్లలూ అనవసరమైన హైరానా పడుతున్నారని' ఆమె అభిప్రాయం.

కానీ డాక్టర్ తప్పక చేయించాలని కాస్త గట్టిగా చెప్పేసరికి ఏమీ అనలేకపోయింది.

కేశవరావు కి కూడా స్కాన్ అన్న మాట కూడా ఎందుకో ఇష్టంగా అనిపించలేదు. కానీ ఆయన మాత్రం చెయ్యగలిగేది ఏముంది? కనీసం జరిగితే ఏముందో తెలుస్తుంది కదా? లేకపోతే యశోద పడుతున్న ఈ బాధకి కారణమే తెలియడం లేదు కదా! అని సమాధాన పర్చుకున్నారు.

టెస్ట్ ఫలితం వస్తుందన్న రోజున కూడా ఆయన మనసంతా చెప్పలేని ఆదుర్దాతో నిండిపోయింది. ఏదో తెలియని భయం కదలాడుతూ కలవరపెట్టింది.

"ఆ పరీక్షా ఫలితం వచ్చేస్తే మనకి అంతా అర్థం అయిపోతుంది" అన్న డాక్టర్ మాటల్నే మననం చేసుకుంటూ ఫలితం కోసం వేచి చూడసాగారు కేశవరావు.

'ఎలాంటి ఫలితం వస్తుందో?' అన్న చిన్న భయం, ఏదో తెలియని అపశకునంలా తోచింది. దాంతో రోజంతా ఆయన రెస్ట్ లెస్ గా తిరిగాడు

సీ.టీ స్కాన్ లో యశోద ఎడమ ఊపిరితిత్తి వెనక కనీ కనిపించకుండా ఉన్న ఒక ముద్ద లాంటి కణితి లాంటిది కనిపించింది.

"ఇక్కడ చూశారా, ఈ కణితి! ఇదే ఆవిడ పడుతున్న బాధకి కారణం. ఇంత వెనకగా, మూలగా దాదాపు టిష్యూల్లో దాక్కుని ఉండడం వల్ల అది మామూలు ఎక్స్ రే లో దొరకలేదు, ఇంత డీప్ గా లేకపోయి ఉంటే ఒక్కసారైనా దొరికి ఉండవలసింది. యశోద గారికి తరచుగా వస్తున్న భుజం నొప్పి, వెన్నులోంచి వచ్చే విపరీతమైన నొప్పికి ఇదే కారణం. అది తెలియకుండానే మెడ, భుజాల భాగాంలో కొన్ని నరాలని ఒత్తుకోవడంతోటే ఆవిడకి అంత తరచుగా, బాగా నొప్పి వస్తోంది! ఇది ఎలాంటిదో,దాని లక్షణాలేమిటో తెలుసుకుంటే మనకి మరింత క్లారిటీ వస్తుంది. " అని డాక్టర్ షా చెప్పారు.

'కణితి ' అన్న మాట వినగానే అందరూ అదిరిపడ్డారు.

ఆ కణితి గురించి తెలియగానే ఇంటిల్లిపాదీ, ఇదీ అని చెప్పలేని షాక్ కి గురయిపోయారు.

ప్రతీ ఒక్కరికీ తెలీని వేదనతో, రకరకాలైన అనుమానాలతో మనసంతా నిండిపోయింది.

'కణితా? అదేమిటి? ఎలా ఉంది? దానివల్ల ఏం ప్రమాదం?' లాంటి ఎన్నో జవాబు లేని ప్రశ్నలు ఉద్భవించాయి.

'ఇంత ఆరోగ్యంగా, చురుగ్గా ఉండే అమ్మ ఊపిరితిత్తుల్లో ఇలాంటిది ఎలా సాధ్యం? పైగా ఎప్పుడూ స్మోకింగ్ అనే మాట కూడా లేని, వినబడని తమ ఇంట్లోనూ, అమ్మ తిరిగే వాతావరణంలోనూ? ' అంటూ యష్ ఆందోళన పడితే,

"అమ్మకిలాంటి ఫలితమా? ఎందుకు? అమ్మ ఏం తప్పు చేసింది? అమ్మకే ఎందుకిలా? కణితి ఏమిటి?" బాధగా అనుకుంది యామిని.

' కలలోనైనా ఎవరికీ హాని తలపెట్టడం మాట అలా ఉంచితే, ఎవరి గురించీ కూడా తప్పుగా అనుకోవడానికి కూడా ఇష్టపడని మనిషి యశోద. అలాంటి తనకి ఇలా ఎలా జరిగింది? అసలు ఈ కణితి ఏమిటి? అది ట్యూమర్ అయ్యే అవకాశం ఉందా? ఉంటే అదేమిటి?' ఇలాంటి ఆలోచనల్లో కేశవ రావు గారు.

ఇలా అందరూ తమ తమ ఆలోచనలతోనూ, ఆందోళనలతోనూ తల్లడిల్లిపోయారు కొన్ని క్షణాల పాటు.

అప్పటివరకూ ఇది ఒక పెద్దవిషయం అనుకోని వారందరి నమ్మకం ఒక్కసారిగా సడలిపోయినట్టయింది.

తాము అనుకున్నట్టు ఇది సాధారణ విషయం కాదని అర్థమైనా,

' అసలు కారణమేమిటి?

ఊపిరి తిత్తిలో గడ్డ ఏమిటి? అది ఎంత ప్రమాదకరం?

అది లంగ్ కాన్సర్ అయ్యే ప్రమాదముందా?

ఇప్పటికే కేన్సరా?

చికిత్సా మార్గాలు ఏమిటి?

అసలు ఇన్ని ఎక్స్ రేలలోనూ ఒక్కసారైనా ఎందుకు బయటపడలేదు? అంత లోపలకి దాక్కున్నట్టున్న దాన్ని తొలగించడం సాధ్యమేనా? ఆపరేషన్ లాంటిది చెయ్యగలరా? లేదా లేజర్ లాంటివాటివేదైనా వాడి కరిగించే వీలుంటుందా?

తమ అదృష్టం బావుండి అది కేవలం మామూలు గడ్డేనా? మందులకి కరిగిపోతుందా?'

ఇలాంటి అనేక సందేహాలు ముగ్గురినీ అమితంగా భయపెట్టాయి.

తేరుకున్న కొద్ది నిమిషాలకి వారు ముగ్గురూ డాక్టర్ చుట్టూ చేరి తమ ప్రశ్నలన్నింటినీ సంధించారు.

"యశోద కి ఎంత చెప్పాలి? ఏమని చెప్పాలి? ఎప్పుడు చెప్పాలి? మా ఇంట్లో ఎప్పుడూ రహస్యాలు ఉంచుకునే అలవాటు లేదు డాక్టర్. ఏదైనా మాలో మేము చెప్పుకుని, అవసరమైన సలహాలు, సూచనలు మాలో మేము చర్చించుకుని పరిష్కారాలు వెతుక్కుంటాం. ఏ నిర్ణయమైనా కలిసే తీసుకుంటాం. పారదర్శకత ని పాటించే ఫేమిలీ మాది. ఏ సమయనైనా కలిసి సాధించడమే మా పథం. మేము ఎప్పటినించో అనుసరిస్తున్న మార్గం. అన్ని విషయాలు యశోదకి తప్పకుండా చెప్పాలి,చెప్తాం. ఎప్పుడు, ఎలా అనేది మీరు చెప్తే మాకెంతో మేలు చేసినవారవుతారు" అన్నారాయన.

డాక్టర్ ఆయన చేతి మీద చెయ్యి వేసి నెమ్మదిగా అన్నారు.

" మీరన్నది నిజం. ఆవిడేమీ చిన్నపిల్ల కాదు. మనం ఈ రోజు చెప్పకపోయినా, మరో నాలుగు రోజుల్లో ఆవిడకే లేనిపోని సందేహాలొస్తాయి. అప్పుడైనా మనం చెప్పాలి కదా!" .

" అవును డాక్టర్, మీరు చెప్పింది కరక్ట్." అంది యామిని.

"ఏ విషయంలోనైనా అందరి కంటే బాగా ఆలోచించేదీ కానీ, పరిష్కారాలు చెప్పగలిగేదీ మా ఇంట్లో అమ్మే డాక్టర్. ఈ విషయం లో కూడా అంతే!" ఆ మాటలంటున్నప్పుడు యష్ గొంతు సన్నగా వణికింది.

సహానుభూతితో చూశారు డాక్టర్ షా.

నెమ్మదిగా ఆయనే యశోదకి విషయం చెప్పారు. డాక్టర్ మాటలు విన్న ఆవిడ కాసేపు ఏమీ మాట్లాడలేదు. కేవలం భర్త చేతిని తన చేతిలోకి తీసుకుని, కళ్ళు మూసుకుని మౌనంగా ఉండిపోయింది.

పి.ఇ.టి– సి.టి స్కాన్ చేయిద్దామని అని చెప్పారు డాక్టర్ షా. దానివల్ల అన్నీ తేటతెల్లమౌతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

" రేపు సాయంత్రం చేయిద్దాం కేశవ గారు" అన్నారు.

" మీరంతా అనవసరం హైరానా పడుతున్నారు, నాకేమీ కాలేదు" అంటూ ప్రతీ సారీ కొట్టిపారేసే యశోద ఈ సారి అలా చెప్పలేకపోయింది. మనసులో ఎంత ఇష్టం లేకపోయినా, జరగవలసిన కార్యక్రమాలకి సరే అనక తప్పని పరిస్థితి కావడంతో ఆవిడ మౌనం వహించింది.

ఆ రాత్రి అత్యవసరంగా ఎవరినో కలవాలి అని కేశవరావు తప్పక వెళ్ళవలసి వచ్చింది.

" ఒక్క గంటలో వచ్చేస్తాను! అమ్మతోపాటే ఉండండి ఇద్దరూ. ప్లీజ్" అంటూ పిల్లలకి చెప్పి వెళ్ళారు ఆయన.

తగ్గించిన లైట్ వెలుగులో బాల్కనీలో కూర్చున్నారు ముగ్గురూ.

" నాన్న బయలుదేరారుట అమ్మా, ట్రాఫిక్ మరీ ఎక్కువ లేకపోతే ఓ అరగంటలో వచ్చేస్తారు" అంది యామిని చిన్నగా.

" పరవాలేదు. మీరు కూడా ఏమైనా పనులుంటే చూసుకోండి. నాకోసం మానేసుకోవడం ఎందుకు? రేపు పరీక్ష ఏమిటన్న ఒక చిన్న ప్రశ్న తప్ప ఏమీ లేవు నా మనసులో" అందావిడ చిరునవ్వుతో.

తల్లి నవ్వు చూసి తను కూడా చిరునవ్వు నవ్వింది.

చిన్న గొంతుకతో పి.ఇ.టీ స్కాన్ అంటే ఏమిటో, ఎలా చేస్తారో లాంటి వివరాలు చెప్పడం మొదలు పెట్టింది.

కూతురి మాటలు శ్రద్ధగా వింది యశోద.

" సాధారణ సి.టీ లేదా ఎక్స్ రే స్కాన్లు కేవలం శరీర నిర్మాణాన్ని మాత్రమే చూపిస్తాయి. కానీ పెట్ స్కాన్ లో శరీరానికి స్వల్ప మోతాదులో రేడియోధార్మిక పదార్థాన్ని (గ్లూకోజ్ ట్రేసర్) ఎక్కించి స్కాన్ చేస్తారు. దానివల్ల ఆ కణాల గురించి చాలా వివరాలు తెలుస్తాయి. ఇన్నాళ్ళూ కనిపిచకుండా ఎక్కడో మూలగా ఉన్న నీ ఊపిరితిత్తులలోని కణితి ఎంత పరిమాణంలో ఉందో అది ఎలాంటిదో కనుక్కుంటే దాన్ని బట్టి తర్వాత ఎలా ట్రీట్ చెయ్యాలి అనేది డాక్టర్ గారికి చాలా స్పష్టమైన అవగాహన వస్తుంది. అంతే అమ్మా! " అంది యామిని.

"స్కాన్ చేయడానికి 6 గంటల ముందు ఏమీ తినకూడదు, కేవలం మంచి నీరు మాత్రమే త్రాగాలి. రేడియోధార్మిక పదార్థం ఇంజక్షన్ ద్వారా శరీరంలోకి ఎక్కించిన తర్వాత, మందు శరీరం అంతా వ్యాపించడానికి దాదాపు 1 నుండి 2 గంటల సమయం వేచి ఉండాల్సి వస్తుంది." అని యష్ కూడా చెప్పాడు.

ఆ తర్వాత ఇద్దరూ కలిసి ఆమె అడిగిన చిన్న చిన్న ప్రశ్నలకి ఆమె కంగారు పడకుండా ఉండేలా సమాధానాలు చెప్పారు.

అవన్నీ విని అర్థం అయినట్టుగా తల ఊపింది యశోద.

ఇద్దరూ కూడా స్కాన్ మిషన్ లో ఎంత సేపు ఉండవలసి వస్తుంది? లాంటి విషయాలు కావాలనే చెప్పలేదు.

అవి విని కంగారుపడుతుందేమో అని అనుకున్నారు వాళ్ళు.

పిల్లలిద్దరూ తన దగ్గర చేరి అలా చెప్పడం యశోదకి ఎంతో బావుంది.

వాళ్ళిద్దరూ పెద్దవాళ్ళయి వాళ్ళ ఉద్యోగాల్లో స్థిరపడ్డాకా, అంత టైము దొరకడం, అదీ ఇద్దరికీ ఒకేసారి కుదరడం బావుంది.

పైగా వాళ్ళిద్దరి చిన్నప్పుడు పరీక్షలు, కాంపిటీషన్లు ఇలాంటి వాటి గురించి వాళ్ళు భయపడే వేళల్లో తాను వాళ్ళ వెన్ను తట్టి ధైర్యం చేప్పేది.

' కాలం గిర్రున తిరిగితే అది రివర్స్ అయ్యి వాళ్ళు తనకి చిన్నపిల్లకి చెప్పినట్టు చెప్తున్నారు ' అనుకుంది చిరునవ్వుతో.

గూగుల్ లో సమాచారం చూడడం తనకీ తెలుసు కదా! అయినా వాళ్ళు అలా చెప్తుంటే ఏదో తెలియని చిన్నపాటి హాయిగా అనిపించింది యశోదకి.

'మౌనంగా కాసేపు మెడిటేషన్ చేసుకుని తనని తాను సిద్ధం చేసుకోవాలి' అని నిర్ణయించుకుంది.

వాళ్ళు మాట్లాడుకుంటూ ఉండగానే వెళ్ళినపని ముగించుకుని కేశవరావు ఇంటికి చేరారు.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments